
# సద్గురు శ్రీ నాన్నగారు



# సద్గురు శ్రీ నాన్నగారు

తెలుగు అనువాదం :
పింగళి సూర్యసుందరం

శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు

1

# ధ్వనించే మౌనం

## సీన్ కాంబెల్

(నాన్న గారితో సమావేశం - 1997 క్రిస్మస్ దినమున శ్రీరమణాశ్రమ సమీపాన ఆంధ్రాశ్రమంలో)

డాబా మీద సత్సంగం జరుగుతోంది. మేమప్పటికే ఆలస్యమయ్యాం నిజానికి, మేమాలస్యం కాలేదు, ఆయనే ముందు విచ్చేశారు. ఏమైనా, ఫలితమొక్కటే కదా. ఒక ఇనుపమంచంమ్మీద ఆ చిన్నవిగ్రహం ఆసీనమై ఉంది. ఆయన పాదాల చెంత చక్కని దుస్తులు ధరించిన వందలాది స్త్రీలు కూర్చుని ఉన్నారు. పైన అందమైన ఆచ్ఛాదన రెపరెపలాడుతోంది, దానిని పట్టించుకోలేదాయన. ఆయన అందిరివంకా పరిపూర్ణమైన మౌనంతో, మృదువుగా చూస్తున్నారు. ఆయన మామూలు మనిషివలెనే కనబడ్డారు, అయినా - ఎంతో వృద్ధరూపాన్నీనవ్వుకొలిపే రూపాన్నీ చూస్తాననుకుంటూ వచ్చాను - కాని ఆయన మౌనం ముందు ఆ నవ్వు పరారైంది. ఓరి భగవంతుడా ! ఆ మౌనం ఎంత

ప్రగాఢం, ఎంత గంభీరం, ఎంత నిశ్చలం - ఏమిటి నేననుభవిస్తున్నది?

తలుపుదగ్గర ఉన్న ఒకాయన, మమ్మల్ని చిన్నగుంపుగా కూర్చున్న పాశ్చాత్యుల మధ్య కూర్చోమని సంజ్ఞ చేశారు. ఆ జనసమ్మర్దంలో దారి చేసుకొని వెళ్లాం. అంతకుపూర్వం నాకెప్పుడూ అటువంటి అనుభవం కలుగలేదు. ఆయన నుండి ఏదో ప్రసరిస్తున్నట్లుంది. ఏ క్షీరాబ్ధిలోనో నేను త్రోవ చేసుకుంటూ వెళ్తున్నాననిపించింది. నిటారుగా నిలబడలేకపోయాను ! నాలో ఏదో ఒక అంశం మెల్లగా నా చుట్టూ పెనవేసుకుపోతున్న ఆఘోషించే మౌనంలో ఇంకి పోతోంది, అంతరాంతరాలలోని ఏ అగాధాలలోనో ఇంకిపోతోంది.

నేను ఎప్పుడు కూర్చున్నానో జ్ఞాపకం లేదు. కాని ఆ కోతి జ్ఞాపకముంది. నాన్నగారికై ఎవరో అరటిపళ్లు తెచ్చారు. ఒక కోతి వచ్చి ఆయన ఎదురుగానే ఆ పళ్లని తీసుకుంది. అది విపరీతంగానూ ఉంది సహాజంగానూఉంది. నాన్నగారి వద్దనుండి వెదజల్లబడుతున్న దానితో పొంతన కలిగి ఉంది. ఏది

నాకవగాహన కావటం లేదు. నా మెదడు నిశ్చలమై పోయింది. అందరివైపూఎంతో నిశితంగా, లోతుగా, 'అర్థంగా చూస్తూ, ఒక్కొక్కరి మీద ఒక్కొక్క క్షణమాగుతూ, మరలిపోయే ఆయన చూపులవైపే నేను లగ్నమైపోయాను. వారి చూపులు నా చూపులను సోకాయి, ఎంతసేపో నాపై కేంద్రీకృతమయ్యాయి. నేను కరిగిపోతున్నానా మెల్లగా మాడిపోతున్నానా అనిపించింది, నా మెదడు వేడెక్కిపోయింది. "ఈ మౌనమింత బిగ్గరగా ఎందుకుంది" అని తెలివి తక్కువగా నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

ప్రేమవెల్లువ నన్ను ముంచివేయగా, ఆనందపారవశ్యంతో పులకరింపగా అన్ని ఆలోచనలూ అంతర్ధానమైపోయాయి. ఏదో ఆనందం, ఏదో దిగ్భ్రమ అనుభవమయ్యాయి. ఆ దృక్కులను గుర్తింపగానే ! అసలు అటువంటి చూపులుమానవమాత్రులలో అంతకు పూర్వం నేనెక్కడా ఎదుర్కోలేదు. అయినా, టిబెట్ మఠాలలో ఉండే కొన్ని శిలాప్రతిమలలో, కొన్ని చిత్రాలలో అటువంటి కళ్లనే చూశాను, " బుద్ధుని కళ్లు

" అని కొట్టవచ్చేట్టు అనిపిస్తున్నాయి. అర్ధనిమీలితమైన ఆ చూపుల పట్ల నాకు ఆకర్షణా ఉంది, వెగటూ ఉంది, ఏదో నిరాకారమైన ఆదర్శానికి అవి ప్రతీకలు మాత్రమేనని అనుకునే వాడిని. అవి మానవాతీతమైనవని కూడా అనుకునే వాడిని. కాని, ఆశ్చర్యమేమంటే, నేనిప్పుడు వాటివైపే చూస్తున్నాను !

ఆయన దృక్కులు మరలిపోయాయి. మళ్లీవచ్చాయి. ఆ మౌనాన్నే నేను నమ్మలేకపోతున్నాను ఎంత అందంగా ఉంది! ఆ ఆనందసాగరంలో, అరుణాచల నేపధ్యంలో, మునిగి పోయాను. ఎంతో మృదువైన దరహాసం వేలార్చి ఆయన లేచి వెళ్లిపోయారు. నేను అచేతనుడనైనాను. మంత్రముగ్ధుడనైనాను!

భోజనం చేసేటప్పుడూ, ఆ రాత్రి అంతా కూడా ఏదో అర్ధంకాని స్థితిలో గడిపాను. నేనూహింపని ఏమహత్తరశక్తో నాలోని భావాలనన్నిటినీ తుడిచిపెట్టివేసింది.

26 డిశెంబరు!

నాకు కునుకు పట్టలేదు ఇంతటి మహనీయమైన దానిని నేను ఎ   దుర్కొన్నప్పుడు ఎట్లా పట్టుతుంది? ఆ రాత్రంతా సలసలా కాగిపోయాను. అక్షరాలా! నా చర్మమంతా ఏదో గగుర్పాటుతో నాట్యమాడింది. నా తల విప్పారుతున్న పుష్పమైంది. ఆ పుష్పంపూర్తిగా విచ్చుకోదు. రేకులు ఒకదాని వెంట ఒకటి విప్పారుతూనే ఉన్నాయిరాత్రంతా. నా కల్పనేమో తెలియదుగాని నేను వ్యాకోచిస్తున్నట్లనిపించింది. అట్లా వ్యాకోచిస్తున్న నాశరీర పరిధి చెట్లనూ, దాదాపు ఏభైఏడుగుల దూరంలో ఉన్నవారిని తాకుతున్నట్లు అనిపించింది. దేనిని విశ్లేషింపలేను. ఇది ఎక్కడికి తీసుకొని వెళ్తుందో, అక్కడికేపోవాలినేను.

ఉదయం ఎనిమిదైంది. మళ్ళీ ఆ జనసమూహంలో మొదటినుండి ఏడెనిమిది వరుసల వెనుకగా మెల్లగా ఇరుక్కున్నాను. నిన్నటివలె ఆయనకు సమీపానలేను. అయితేనేం!ఏవిషయము పట్టించుకోలేక పోయాను. మనస్సులేదక్కడ.

ఆయనవచ్చి మంచంమీద కూర్చొన్నారు. ఒక బ్రాహ్మణుడు వచ్చి ఏదో సంస్కృత స్తోత్రాన్ని

పాడనారంభించాడు అది ఎప్పటికీ అవ్వదు! అంతసేపూ నాన్నగారు తమ చేతులని మోకాళ్ల మీద ఆన్చి, దూరంగా ఉన్నఅరుణాచలంవైపేనిశ్చలంగా చూస్తూ ఉండిపోయారు. అరుణాచలం పట్ల వారి ఆదరం ఆ చూపులో స్పష్టంగా కనబడింది. అప్రయత్నంగా నా కళ్లవెంట నీళ్లు కారాయి. ఆయన పట్ల, అరుణాచలం పట్లా, అందిరిపట్లా కలిగిన ఆ ప్రేమ నన్ను ముంచి వేసింది.

నామనస్సు చెప్పలేని, నాహృదయం చెప్పగోరే ఆ ప్రేమని నా దేహం వ్యక్తం చేసింది కన్నీరుగా.

ఆ తరువాత కొంతసేపటికి కాబోలు ఆ బ్రాహ్మణుడు అదృశ్యమైనాడు. మళ్లీ తమ చూపులతో, తమ ప్రేమలో అందరినీ నాన్నగారు ముంచివేశారు. ఆయన వీక్షణం అటూ ఇటూ తిరుగుతూ, అప్పుడప్పుడూ నా వీక్షణాన్ని స్పృశిస్తూ, మళ్లీ వెళ్లిపోతోంది, అందులో ఎంతటి కోమలమైన కరుణ ! ఎంతటి ప్రేమ! మౌనం గాఢమవుతోంది, ఇంకా ప్రగాఢమవుతోంది, నా చైతన్యమంతా ఆయనపైనే కేంద్రీకృతమవుతోంది, నాకు బయట ఎక్కడో గందరగోళంలో ఒక

ప్రపంచముంది. కాని దాని ధ్యాసే లేదునాకు. నాకు తెలిసినదల్లా చెవులలోఘోష, దేహపుమంట, ఆనేత్రాలు!

ఆచూపులు నా చూపులను తాకాయి మళ్ళీ. భయానకంగా గగుర్పాటు కలిగేటట్టుగా ఆయన రమ్మని సంజ్ఞ చేసారు. నన్నా, నన్ను పిలుస్తున్నారా, నమ్మలేకపోయాను, నమ్మటానికి సాహసింపలేక పోయానును. నా వెనుకనున్న వారినెవరినో పిలుస్తున్నారేమో నేను కదలలేదు. అయినా ఆయన మళ్ళీ సంజ్ఞ చేసారు. మళ్ళీ మరోసారి కూడా. ఒక్క క్షణంపాటుచెప్పలేని భయం, సంతోషం. నా వెనుకనున్న భారతీయ స్త్రీలు నన్ను తాకి, ముందుకు పొమ్మన్నారు. గతఇరవై నాలుగు గంటలలో అట్లా ముందుకు తోసుకెళ్లటం ఇది రెండవసారి. చచ్చి పోతాననుకున్నాను. ఈసారి అజ్ఞాతంగా వెనుక పడిపోవటమంటూ లేదు, బహిర్గతమవటంనుంచి తప్పించుకోవటము లేదు. ఆక్షణంలో నాకు కలిగిన భావాలను చెప్పలేను. ఆయన నన్ను గుర్తించినందుకు . నాపై ప్రేమ చూపినందుకు నాప్రాణాలయిన ఇవ్వగలనని ఒక వంక అనిపిస్తే మరోవంక

అక్కడ్నుంచి పారిపోయి ఎక్కడయినా దాక్కుందామనిపించింది.

ఆయన పాదాలను ఆడిస్తున్నారు. ఆయన మంచానికి ప్రక్కన ఒక కాంతి పుంజంలో పడిపోయాను. సూర్యుని కిరణాలవల్ల పైకి చూచిన ఏమీ కనబడలేదు. కానీ నాలో అస్పష్టంగా ఏదో ఇట్లా పలుకుతున్నట్లనిపించింది.

"భగవంతుడు నిన్ను తన పాదాల వద్ద కూర్చుని దర్శనంచేసుకోమంటుంటే నువ్వుఎక్కడో దూరంగా కూర్చోవటానికి ప్రయత్నించావు."

ఇటువంటి భావమే నాన్నగారికి కలిగిందేమో. ఆయన కొద్దిగా నవ్వారు. తన కుడివైపుకు రమ్మన్నారు. అసంకల్పితంగా యాంత్రికంగా అటుకదిలాను. । తలక్రిందుగా నిలబడు। అని ఆయన అన్నా అట్లా చేయటానికే సిద్ధమైనాను.

నాదేశం, నా వృత్తి, నేను భారతదేశానికి ఎన్ని సార్లు వచ్చాను, ఎక్కడుంటున్నాను అంటూ నెమ్మదిగా ప్రశ్నించారు. ప్రశ్నలు వేస్తున్నంతసేపూ ఆయన నా తలని

నిమురుతూనే ఉన్నారు, నా నుదిటిని తాకారు. నా చేతిని ఎంతో ఆప్యాయతతో, కోమలత్వంతో నిమిరారు. నేను ఒక్కసారిగా ప్రియుడనో, పిల్లవాడినో, శిష్యుడనో అయిపోయాననిపించింది. అందరూ నన్నే చూస్తున్నారనిపించింది. అక్కడ దాదాపు రెండువందల మంది ఉన్నా, అక్కడ ఎవ్వరూ లేనట్టే అంతటి సాన్నిహిత్యము, ఆయనలో ఉన్న కేంద్రీకృతమైన ప్రేమ, సహజంగా అన్నిటినీ స్వీకరించే లక్షణం నేనెక్కడా చూడలేదు. సహజమైన పురుషత్వంతో బాటు, సంపూర్ణమైన స్త్రీత్వంకూడ ఉంది ఆయనలో. నాలో నాకే తెలియని పరిపూర్ణమైన విశ్వాసాన్ని వారు వెలికి తీశారు. అవిచ్ఛన్నంగా ప్రవహించే వారి ఎరుకలో వారు నాలోని ప్రతి అణువుతోను సంభాషిస్తున్నారా అనిపించింది. ఆ ప్రేమ మయచూపులు, నాకళ్లకు కొద్ది అంగుళాల దూరంనుండి, తొలిచివేస్తున్నాయి. వర్ణనాతీతమది, నిత్యమది దానిని వర్ణింపబూనటమే దానిని కలుషితం చేయుటం. అటువంటి సౌందర్యాన్ని, అంతటి అంతర్గత ప్రశాంతిని, ఆప్యాయతనీ నేనెప్పుడూ చూడలేదు.

కాలగతి తెలియలేదు నాకు. హృదయం నిండి పోగానే కళ్లు మూసుకునేవాడిని, ఇంకా కావాలనిపించినప్పుడు కళ్లు తెరిచేవాడిని - ఆ చూపు నావంక, నాలోపలికి వెళ్తూనే ఉంది. పరిపూర్ణభావం కలిగింది. నీటి బిందువు సాగరాన్ని చూచినట్టూ, ఆసాగరం సాదరంగా దానికి స్వాగతం చెప్పినట్టూను, అంతసేపూ ప్రేమజ్వాల నడుమ నేను, కరిగిపోయేజ్వాల మధ్యనేను!

ఈ మహనీయుడు శ్రీరమణుల అనుగ్రహం వల్ల ఆత్మసాక్షాత్కారం పొందారు. రమణమార్గాన్ని కొన్ని సంవత్సరాలుగా బోధిస్తున్నారు. శ్రీ రమణుని గురూత్తమునిగా కొనియాడారు. నిష్కళంకమైన జ్ఞాని, ఆత్మవిచారమార్గ ప్రబోధకులు. నాలోని అనుమానాలనూ, అన్వేణలను మాతృప్రేమసదృశమైన కరవాలంతో ఛేదించారు. నాహృదయంలో ప్రేమ జ్వాలనురగిల్చారు. మాటలను, విశ్లేషణలను విసర్జించి నా అంతరాంతరాలలో ఉన్న మౌనానికి మార్గం చూపారు. అక్కడ ఏకమైనాము. దానికి మాటలు లేవు, ఎప్పుడూ ఉండజాలవు.

అక్కడ ఒక అరగంటసేపు కూర్చున్నాను ఆయన లేచివెళ్ళారు. నేను అక్కడే కూర్చొన్నాను లేవలేక, లేచి వెళ్లటానికి ఇష్టంలేక. నా చూపు అరుణాచలం వైపు కేంద్రీకరించి కూర్చున్నాను. అనుగ్రహస్పర్శవల్ల నా హృదయంలో అంకిత భావం కలిగింది. అందంగా నిలిచిపోయింది.

ఆ రోజు సాయంత్రం గణేశన్ ఇంట్లో జరిగిన సత్సంగానికి వెళ్లాను చివరికి గణేశన్ నా దగ్గరకు వచ్చి ప్రొద్దున్న మీకు కబురు అందజేయులేకపోయాను మన్నించండి" అన్నారు. అర్ధంకాక, తెల్లముఖం వేశాను' ' ఉదయం సత్సంగానికి ఇక్కడకు రావద్దు. నాన్నగారి వద్దకు వెళ్ళండి. అని కబురుపంపుదామనుకున్నాను' ' అన్నారు.

"ఆ కబురు నాకు అందింది ఎట్లాగో గణేశన్ గారూ" అని మాత్రం అనగలిగాను.

## ఆ వర్తమానం నా కెట్లా వచ్చింది?

# శ్రీ నాన్నగారు,

(పుణ్య భారతి భూమిలో యాత్రలు, రోజర్ హౌస్‌డెన్)

ఎంతో విభిన్నమైన వ్యక్తులు నాన్నగారు, పూంజా. కాని ఇద్దరూ తమతమ ఆధ్యాత్మిక జాగృతి శ్రీరమణమహర్షి అనుగ్రహం వల్ల కలిగినదేనంటారు. నాన్నగారు ఆంధ్రప్రదేశ్‌లో గోదావరీ మండలంలో ఒక గ్రామంలో వ్యవసాయదారుడుగా తమ జీవితంలో అధికభాగం గడిపారు. ఇరవై సంవత్సరాల క్రితం వారికి స్వప్నంలో ఒక సాధువు కనబడి చెక్కిలిపై ముద్దుపెట్టుకున్నాడు. ఇది జరిగిన కొన్నాళ్ల తరువాత ఆయన ఒక ఆధ్యాత్మిక గ్రంథానికి సంబంధించిన వ్యాపార ప్రకటనను చూసి ఆ గ్రంథాన్ని తెప్పించుకున్నారు. ఆ పుస్తకాన్ని తెరువగానే ఆయనకు ఒక ఫొటో కనబడింది, ఆ ఫొటో తనను కలలో ముద్దు పెట్టుకున్న సాధువుదే! ఆ ఫొటో శ్రీ రమణ మహర్షిది - వారి గురించి ఆయన అంతకు పూర్వం విననైనా వినలేదు. అరుణాచలంలోని శ్రీ రమణాశ్రమానికి యాత్రకై వెళ్లారు. ఆ తరువాత అనేక పర్యాయాలు ఆ యాత్రసాగించారు. అప్పటికే పదిహేను సంవత్సరాల

క్రితం శ్రీ రమణులు దేహం విడిచారు. నాన్నగారి జీవితమంతా శ్రీ రమణుల బోధనలు చుట్టూ తిరగటం ప్రారంభించింది, శ్రీ రమణుల బోధనలనీ, ఉపదేశాన్నీ పరిసర ప్రాంతాలలో ప్రచారం చేయటమే వారి ధ్యేయమైంది. శ్రీరమణాశ్రమంలో ఉండగా ఒకనాటి ఉదయం, నిద్ర నుండి, ఇంకా పూర్తిగా మెలకువరాని స్థితిలో తన మనస్సు హృదయంలో విలీనమైపోయిన అనుభూతి కలిగిందని వారు చెప్పారు. అంతటితో, వారిలో ప్రగాఢమైన మార్పు వచ్చింది. ఏదో అజ్ఞాత శక్తి తనని నడిపిస్తున్నట్టు అనిపిస్తుందని చెప్పకున్నారు. కేవలం ధర్మ ప్రచారకునిగా కాక, గురువుగా వారిని ప్రజలు స్వీకరించటం మొదలుపెట్టారు. వారి ఖ్యాతి ఆంధ్రదేశమంతటా త్వరలో వ్యాపించింది.

ఈ రోజుల్లలో వారు తరచు దక్షిణ భారతంలో పయనిస్తూంటారు. మధ్య మధ్య ఏ భక్తుని ఇంట్లోనో అప్పుడప్పుడూ బస చేస్తూ ప్రయాణాన్ని కొన సాగిస్తూంటారు. వారు ఎక్కడ బసచేస్తే అక్కడకి ఆ ప్రాంతపుప్రజలు రోజంతా వారి వద్దకు వచ్చి తమ తమ సమస్యలని చెప్పకుంటారు, వారి సహాయాని

అర్థిస్తారు. ఆయన వాళ్ళని ఆశీర్వదిస్తారు. వాళ్ళతో బాటు మౌనంగా కూర్చుంటారు. ఒక్కొక్కసారి వాళ్ళని ఉద్దేశించి ప్రసంగిస్తారు. భారతదేశంలో సాంప్రదాయంగా గురువు ఒక ఆత్మబంధువు, స్నేహితుడు, మార్గ దర్శకుడు, కోరిన వారికి ఆధ్యాత్మిక బోధకుడు. ఈ లక్షణాలన్నీ నాన్నగారిలో ఉన్నాయి.

1993 సంవత్సరాంతంలో తిరువణ్ణామలైలోని శ్రీ రమణాశ్రమంలో నాన్నగారితో నా పరిచయం జరిగింది. ఆనాటి సాయంత్రం లైబ్రరీ వద్ద ఒక గురువు అందరికీ దర్శనమిస్తున్నారని ఒక స్నేహితుడు చెప్పాడు నాకు. నామట్టుకునాకు, అరుణాచలము, శ్రీ రమణులు నివసించిన గుహ చాలును, వేరే గురువు ఎందుకు, అనుకుంటూ, ఆయన దర్శనంపట్ల ఆసక్తి లేక, నా స్నేహితుని మాటని పట్టించుకోలేదు. నా గది లైబ్రరీ ప్రక్కనే ఉంది. సాయంకాలం నేను గుహ నుండి తిరిగి వచ్చేటప్పటికి కొందరు పాశ్చాత్యులు, ఆరవైసంవత్సరాలు పైబడిన ఒకాయన కుర్చీలో కూర్చోగా, ఆయన వద్ద నిశ్శబ్దంగా, ఎదుట కూర్చున్నారు. ఆయన పాదాలవద్ద చక్కని వస్త్రాలను

ధరించిన భారతీయ స్త్రీలు ఎంతో తీక్షణంగా ఆయనవైపే చూస్తూ కూర్చున్నారు. ఆయన చూపులుకూడ ఒకరినుండి మరొకరివైపు మళ్ళుతున్నాయి. ఆయన అతి సామాన్యునివలే కనబడ్డారు. అప్పుడప్పుడు దీర్ఘంగా శ్రేనుస్తూ, పొట్టని నిమురుకుంటున్నారు.

చీకటి ముసిరేవరకూ ఉండాలన్న తలంపుతో అక్కడే కూర్చున్నాను. కొద్దిక్షణాలలోనే అక్కడ సమావేశమైన వారిలోని గంభీరమైన నిశ్శబ్దత నాకు అవగతమయింది. నాన్నగారు ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తి వైపు తన చూపును మారుస్తూ, అప్పుడప్పుడూ కొందరి మీద చూపును కొన్ని క్షణాలపాటు నిలుపుతూ, మధ్య మధ్య ఆశీః పూర్వకంగా కుడి చేయిని లేవనెత్తుతున్నారు. నా శరీరము, మనస్సూ నిశ్చలమైపోయాయి. అక్కడ నుంచి లేచి వెళ్లాలన్న భావం మాయమైపోయింది. అసలు అన్ని ఆలోచనలూ అంతర్ధానమైపోయాయి. వారి చూపు కోమలము, కరుణాపూరితము ప్రియుడు ప్రేయసిపై సారించినదానివలే. ఆ చూపులో కర్తృత్వ భావంగాని,

వ్యక్తిత్వభావంగాని, కామనగాని ఏదో ప్రయోజనము సాధిద్దామన్న ఉద్దేశంగాని లేదు. ఆ చూపు కేవలం అమాయకం, శూన్యం, ప్రేమమయం. అది అందరికీ లభ్యమే. కాని ఎవరిమట్టుకు వారు అది తమకి మాత్రమే ప్రత్యేకమనుకొంటారు. ఆయన దేహంలో ఏ విధమైన బిగీ ఉన్నట్టు లేదు. - వారి సర్వస్వము వారి చూపులు ద్వారా నిరాటంకంగా ప్రవహిస్తున్నట్లుంది. అరగంట గడిచింది. వారు నిశ్శబ్దంగా తలపంకించి లేచి తమ గదిలోకి వెళ్లి పోయారు. ఎవ్వరూ కదలలేదు. ఆ నిశ్శబ్దం మరికొన్ని నిమిషాలు అట్లాగే ఉండిపోయింది.

ఎట్టకేలకు నేనూ లేచాను. అప్రయత్నంగా, నాన్నగారి గది వైపు నడిచాను. వారి శిష్యుడొకడు తలుపువద్ద ఉన్నారు. నేను నాన్నగారిని కలుసుకోవచ్చా అని అడిగాను. శిష్యుడు నాకు దారి చూపాడు. నాన్నగారు మంచం మీద కూర్చుని ఉన్నారు. వారి చేతుల్లో వార్తా పత్రిక ఉంది.

"మీ దేశం ఏది?" అని అడిగారు. చెప్పాను., వెంటనే 'టైమ్స్' పేపర్ని చదువుతారా అని అడిగారు. నేను

చదువను అనగానే ఇంగ్లండులోని ఇతర ప్రముఖ పత్రికల గురించి అడిగారు క్లుప్తంగా సమాధానమిచ్చి, అసలు విషయానికి వచ్చాను " ఇప్పుడు మీరు మమ్మల్ని మౌనవంతులను చేసిన విధం నామనస్సుకి హత్తుకుపోయింది నేను ఎక్కడ ఉన్నా, ఎల్లవేళలా ఆ మౌనం నేనే అవ్వాలని ఉంది. మీ బోటివారి సమక్షాన, భారతదేశంలో ఎప్పడూ నేను ఉండలేను కదా" అన్నాను. సంతోషంతో నిండిపోయిన బిడ్డలాగ. ముందుకు వంగి," నీకు మౌనమంటే ఇష్టమా? అయితే రేపు విరూపాక్ష గుహకి నాతోరా నీ ప్రశ్నకి సమాధానమిస్తాను" అన్నారు.

మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకు ఆయనతో బాటు కారులో గుహకి వెళ్లే ఏర్పాటు జరిగింది.

నిర్ణీత వేళకి నేనూ ఇంకా కొందరు భక్తులూ కలిసి కారు ఎక్కాం. మరొక కారులో నాన్నగారూ ముందు వెళ్లారు. ఊర్లోకి వెళ్లి అక్కడ నుంచి అడ్డ దారిన కొండనెక్కి గుహ వద్దకు వెళ్లాము. అప్పటికే నాన్నగారి రాకకై ఎదురుచూస్తూ గుహ ఎదురుగా చాలామంది

భక్తులు గుమిగూడారు. నాన్నగారు గుహాలోకి వెళ్ళి ప్రణామము చేసి బయటికి వచ్చారు. ఒక చెట్టు నీడన కూర్చున్నారు. ఆ తరువాత తమ భక్తులనుద్దేశించి, తమ మాతృభాష అయిన తెలుగులో, అరగంట సేపు ప్రసంగించారు. నేనూ. నాతో బాటే ఉన్న ఇతర పాశ్చాత్యులూ మౌనంగా కూర్చున్నాం. ఆయన మాట్లాడుతుండగా కూడ, మౌనం తెలియవచ్చింది. నా ప్రశ్నకు వారు సమాధానమీయవలసిన అవసరం రాలేదు. ఆ సాయంత్రం ఆశ్రమభోజనశాలలో అందరితో బాటే, మామూలు ధోవతి కట్టుకొని, నేలమీద కూర్చున్నారు, ఏవిధమైన ప్రత్యేకతా లేకుండా! ప్రయత్నంతో నడుస్తున్నట్లు కాక, అప్రయత్నంగా జారిపోతున్నట్టు ఉంటుంది వారి జీవిత సరళి.

వారి దర్శనానికై సాయంత్రం వెళ్ళినప్పుడు, తమకి దగ్గరగా కూర్చోమని సంజ్ఞ చేశారు. తరచూ నావైపు అమాయకపు లాలిత్యంతో చూస్తూ, నా తలను నిమురుతూనే ఉన్నారు. అంతమందిలో నాపై ప్రత్యేకంగా వారు చూపుతున్న ఆప్యాయతకు బిడియం కలిగింది మొదట, కాని కొద్దిసేపటికి ఒక విధమైన ప్రశాంతి నెలకొన్నది. అది నాలో కొన్ని వారాల పాటు

నిలిచింది. ఆ మర్నాడు నాన్నగారి తిరుగు ప్రయాణం. వారికి వీడ్కోలు చెప్పటానికి వచ్చిన జనసమూహంలోనేనూ ఉన్నాను. కారువైపు వెళ్తూ నా వద్దకు వచ్చి, నన్ను తమ చేతులలోకి తీసుకొని 'రోజర్, రోజర్' అంటూ, ప్రియుని వద్దనుండి సెలవు తీసుకుంటున్నట్టు మందహాసం చేశారు. ఈ విధంగా ఆయన చాలామంది దగ్గర ప్రవర్తించటం ఆ తరువాత గమనించాను. ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైనట్టు! కృష్ణుడు గోపికలతో ప్రవర్తించిన తీరుకు సజీవ దృష్టాంతం నాన్నగారు. దీనిని మరెక్కడా చూడలేదు నేను.

కొన్ని నెలల తరువాత, నాన్నగారితో గడపటానికి వారి గ్రామానికి వెళ్లాను. వారితో బాటు, ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాను. ఆ ప్రయాణము, గ్రామీణ భారతంలోకి: ప్రతి గ్రామమూ సంప్రదాయానుసారము నిర్మితమే. ఇళ్లకి, కలపస్తంభాలు కల వరండాలు పైన ఎఱ్ఱని ఇటుకలతో వేసిన చూరు ఉంటాయి. స్పెయిన్‌లోని ఇళ్లవలెనే ఉంటాయి ఇంచుమించు. నాన్నగారు వరండాలో పేపరు చదువుతూ కూర్చుంటారు. వారినిదర్శించటానికి ఒక్కొక్కరే వస్తూంటారు. వచ్చిన

వారిని ఆయన పలుకరిస్తారు. నా బసని వారి పొరుగుననే ఉండే ఒక భక్తుని ఇంట్లో ఏర్పాటు చేశారు. అదే సమయానికి, ఆ భక్తుడు ఏదో పని మీద గ్రామాంతరం వెళ్లారు. మొదటి రోజు ఉదయం నాగది తలుపుని ఎవరో తట్టారు. లేచి చూతును కదా, చేతిలో ఒక కాఫీ కప్పని పట్టుకొని, నాన్నగారు: ఆనాటి సాయంత్రం నన్ను తమ ఇంటి వంటింట్లోకి తీసికొని వెళ్లారు. వారి సతీమణి నాకై చేసిన వంటకాలను నేను భుజిస్తూండగా ప్రక్కన ఉన్నారు. "బాగుందా భోజనం? చాలా బాగుందా"? అంటూ ఇంగ్లీషులో అడిగారు.

నా సంతుష్టిని నేను తెలియపరచాను. వారు సంతోషించారు. ఇంకా కొంచెం వడ్డిస్తూ "ఇది చాలా మంచి వంట - మంచి భోజనం' అన్నారు.

ఆ తరువాత ఒక వారంరోజులపాటు ఆ పరిసర ప్రాంతాలలో ప్రయాణం చేశాం., ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లను వారి భక్తుడొకరు చేశారు. దాదాపు వందమైళ్ల పరిధిలో తిరిగాం. ఎన్నో ఇళ్లకి వెళ్ళాం. వెళ్లిన ప్రతీ ఇంట్లోనూ - నాన్నగారినీ, నన్నూ ముందు భోజనం చేయమనే వారు. మేమిద్దరమూ

భోజనం చేస్తూండగా ఆ ఇంటి ఆడవారు దగ్గరే ఉండి అన్నీ కనుక్కుంటూండేవారు. మా భోజనాలయిన తరువాత ఇంట్లోని మగవారు, ఆఖరిగా ఆడవాళ్ళూ, పిల్లలూ భోజనాలు చేసేవారు, పగలంతా ఎందరో భక్తులు వచ్చి నాన్నగారి పాదాలవద్ద కూర్చునేవారు. ఆయన శ్రీరమణుల బోధనలను వివరించేవారు. అంతేకాక, ఆ వచ్చిన వారి సమస్యలకు పరిష్కారాలు చెప్పేవారు లేకపోతే, మౌనంగా కూర్చునేవారు, ఆ రోజులలోనే మేము మూడు వివాహాలకి వెళ్ళాం. ఒక కొత్త యింటి శంఖు స్థాపనకీ, ఒక కాగితం మిల్లుకీ, నాన్నగారి గౌరవార్థం నిర్మించిన ఆలయానికీ వెళ్లాము. ఎక్కడికి వెళ్లినా నాన్నగారి సన్నిధిశాంతమయమే నెమ్మదిగా ప్రవహిస్తున్నట్లుండేవారు. దేనికీ ప్రతిస్పందిస్తున్నట్లుండేది కాదు. కారులో వెళ్తున్నప్పుడు వారు తమ ఒడిలో శ్రీ రమణుల పటాన్ని పెట్టుకొని ఆ పటం వైపే చూస్తూ అందులో నిమగ్నమై పోయేవారు. మేముగాని, మేము సాగిస్తున్న ప్రయాణంగాని ఆయనకి పట్టేది కాదు. కాని ఎక్కడైనా. ఆగినప్పుడు మాత్రం వారు సన్నద్ధంగా ఉండేవారు - ఎటువంటి పరిస్థితిలోనైనా సరే.

ఇప్పటికి చాలామంది పాశ్చాత్యులు నా వలెనే, నా కంటే ఎక్కువ కాలమే నాన్నగారితో ఇట్లా ప్రయాణం చేశారు. ప్రతివారూ, నాన్నగారి సన్నిధిలో అంతర్లీనమైన మౌనాన్నీ వారి నిరాడంబరతనీ - నాకు ధృవపరచారు. ఒక ముదుసలి తన గాధను వినిపించినప్పుడు నాన్నగారు ఒక గంటసేపు కన్నీరు. కార్చటం చూచానని న్యూయార్క్ నివాసి ఒకడు నాతో చెప్పాడు. తన మటుకు తనకి ఏ ప్రత్యేకమైన అనుభూతి కలిగినట్టు గుర్తింపకపోయినా, నాన్నగారి సమక్షాన ఏదో ఆత్మీయత అనుభవమయిందన్నారు. అంతేకాక, జీవితాంతం తనని వెంటాడుతున్న శోకం తనని పూర్తిగా విడిచి వేసిందని ఆయనని విడిచివెళ్ళిన కొద్ది రోజులలో గ్రహించానని చెప్పాడు. ఈ వివరాలు చెప్పినాయన వయస్సు డబ్బై సంవత్సరాలు.


నాన్నగారికి ఏ విధమైన సాధనా లేకుండానే, కేవలం శ్రీరమణ మహర్షిపట్ల ప్రేమ వల్లనే, ఆధ్యాత్మిక జాగృతి కలగటం వలన ఆయన ఎవ్వరికీ, ఏ సాధనా పద్ధతినీ చెప్పరు. దినచర్యకొనసాగించుకుంటూ తన సమక్షాన భక్తులని ఉంచుకుంటూ వాళ్ళలో ఏదో

పరివర్తనని తీసుకువస్తారు. స్వయంగా గృహస్థుడు కావటం వల్ల ఆయన ఆధ్యాత్మికతను లోక వ్యవహారం నుండి వేరు పరచరు. రోజులో అధికభాగం ఇతరుల దైనందిన సమస్యల గురించి విచారించటంలో, సమాజంలో తన విధి నిర్వహణలో, గడిచిపోతుంది. తన దేశస్థులైన భక్తులతో అద్వైతంలోని వివిధ అంశాల గురించి గంటల తరబడి ప్రసంగిస్తారు. కాని పాశ్చాత్యుల వద్ద ఎప్పుడూ మౌనాన్నే పాటిస్తారు. పాశ్చాత్యదేశాల గురించీ, అక్కడ వార్తా పత్రికల గురించి మాత్రమే ముచ్చటిస్తారు. దీనికి కారణం వారికి ఇంగ్లీషులో అంత ప్రావీణ్యం లేకపోవటం కావచ్చు లేదా భారతీయులవలే కాక పాశ్చాత్యులు మౌనానికే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తారని తెలియుటం కావచ్చు. పాశ్చాత్యులకు ఎన్నో సిద్ధాంతాలు, భావాలూ తెలుసు - వారు కోరుకునేది, ఎదురుచూచేది, ఆ సిద్ధాంతాల కతీతమైన అనుభూతిని.

గురు-శిష్య సంబంధ ప్రసక్తి లేకుండా వారి వద్దకు జనంవచ్చి పోతూంటారు. హృదయం విప్పి మాట్లాడే వారికి, ఎప్పుడూ స్పందిస్తారు ఆయన. ఆ స్పందనలో

ఏ విధమైన కోరికగాని, అధికారం గాని ఉండవు, అన్ని విభేదాలు, అన్ని సంబంధాలూ, అన్ని భావాలు సమసిపోయే స్థితి మనస్సు హృదయంలో విలీనమైతే సంభవిస్తుంది. దీనిపైనే వారు మొగ్గు చూపుతారు. శ్రీ రమణులు కూడా మౌనాన్నే ప్రధాన బోధనగా ఎంచారు. మౌనమే అత్యంత పాటవమైన సంభాషణా విధానమని భావించారు. నాన్నగారి సన్నిధి అతి సహజంగా జనాన్ని ఆకర్షిస్తుంది. గురు - శిష్య సంబందం భారతీయుల సంస్కృతిలో భాగం కాబట్టి భారతీయులకు వారితో అటువంటి సంబంధం కలుగుతుంది.

నాన్నగారి అనుచరులు తిరువణ్ణామలైలో శ్రీ రమణాశ్రమం దగ్గరే ఒక చిన్న భవనాన్ని ఇటీవలే నిర్మించారు. దీని పేరు ఆంధ్రాశమము. ప్రతి ఏడూ అక్కడ కొన్ని నెలలపాటు గడుపుదామని నాన్నగారి ఉద్దేశం. అందువల్ల వారి గురించి ఇంకా ఎక్కువ మందికి తెలిసే అవకాశముంది.


స్మరణమా త్రముననె పరముక్తి ఫలద!
కరుణామృతజలధి యరుణాచలమిది!!